క్లుప్తంగా

నేడు చీమకుర్తి మున్సిపల్ పాలకవర్గ సమావేశం

చీమకుర్తి: చీమకుర్తి మున్సిపల్ పాలకవర్గ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ రామకృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు హాజరుకావాలని కోరారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరులో పేకాటాడుతున్న ఐదుగురిని గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.9,950 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ బి.శ్రీకాంత్ తెలిపారు.

కొనసాగుతున్న ఎన్టీఆర్ కళాపరిషత్ ప్రదర్శనలు


గాంధీ వేషధారణలో చిన్నారులు

ఒంగోలు మెట్రో: రంగారాయుడు చెరువు వద్ద పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల మునిసిపల్ పబ్లిక్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఎన్టీఆర్ కళాపరిషత్ ఉత్సవాల్లో భాగంగా గురువారం ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. ఇందులో భాగంగా నాదస్వరం, కోలాట ప్రదర్శన, నాటిక తదితర కార్యక్రమాలు ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు, కార్యదర్శి అన్నమనేని ప్రసాద్‌రావు పర్యవేక్షణలో జరిగాయి.

రీ సర్వేను పక్కాగా నిర్వహించాలి


గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో

ఆలూరు (కొత్తపట్నం): రీ సర్వేను పక్కాగా నిర్వహించాలని, దానికి గ్రామస్తులు, రైతులు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆర్డీవో లక్ష్మీప్రసన్న ఆదేశించారు. ఆలూరులో గురువారం రీసర్వే ప్రారంభంపై గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రీ సర్వే మంచి కార్యక్రమమని, రైతులంతా దగ్గరుండి తమ భూములు రీ సర్వే చేయించుకోవాలన్నారు. చేసిన తర్వాత హెచ్చు తగ్గులు వచ్చాయని చెబితే కుదరదని, రీ సర్వే చేసేటప్పుడే సమస్యలు చెప్పుకోవాలన్నారు. ముందుగా సమస్యలు ఉంటే గ్రామసభలో అర్జీ రూపంలో ఇవ్వాలన్నారు. ఆలూరులో రీసర్వే ప్రారంభమవుతుందన్నారు. తహసీల్దార్ పి.మధుసూదన్‌రావు, ఆర్ఐ వరప్రసాద్, సర్వేయర్ సుధీర్, వీఆర్వో వెంకట్రావు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

మద్దిపాడు: విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మద్దిపాడు తహసీల్దార్ సుజన్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని కడియాల యానాదయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్తులో ఏం కావాలనుకుంటున్నారో ముందుగానే లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఇప్పటినుంచే కష్టపడాలని సూచించారు. పరీక్షలు చక్కగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులవ్వాలని ఆకాంక్షించారు. అనంతరం అతిథులను సన్మానించారు. విద్యార్థులకు కోలాటం నేర్పిన కటకం వెంకటేశ్వర్లు మాస్టర్ను విద్యార్థులు సన్మానించారు. భోజనాల అనంతరం మధ్యాహ్నం రెండు గంటల నుంచి విద్యార్థులు పాటలు పాడుతూ డ్యాన్సులు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీ జ్యోతి, ఎస్ఐ శివరామయ్య, కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మిరప పంట పరిశీలన

నాగులుప్పలపాడు: మండలంలోని మాచవరంలో గురువారం ఉద్యానవన శాఖాధికారి డి.ప్రత్యూష మిరప పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఫార్మర్ చాట్ యాప్‌ను ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న ప్రతి రైతు ప్లే స్టోర్ ద్వారా ఇన్‌స్టాల్ చేసుకుని పంటల తెగులు ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తే ఆ తెగులు లక్షణాలు, సస్యరక్షణ చర్యల గురించి పూర్తిగా తెలియజేస్తుందని తెలిపారు. ఇది మొత్తం తెలుగులోనే ఉంటుందన్నారు. ఈ యాప్‌లో ఇంకా అనేక వివరాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన సహాయకురాలు పద్మిని, రైతులు పాల్గొన్నారు.

వైద్యాధికారులు లక్ష్యం మేరకు పనిచేయాలి

ఒంగోలు అర్బన్: జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించి లక్ష్యం మేరకు పనిచేసి మంచి ఫలితాలు సాధించాలని డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు వైద్యాధికారులకు సూచించారు. గురువారం ఇండియన్ మెడికల్ హాలులో జాయింట్ డైరెక్టర్ రమేష్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్యాధికారులు, సిబ్బందికి కేటాయించిన హెడ్ క్వార్టర్స్‌లోనే నివాసం ఉండాలన్నారు. అన్నీ ఆరోగ్య కార్యక్రమాల వివరాలను సంబంధిత యాప్‌ల్లో అప్‌లోడ్ చేయాలన్నారు. డీఎల్‌డీఓ సురేష్‌కుమార్, పద్మజ, వాణిశ్రీ, శ్రావణ్ కుమార్, భగరథి, శ్రీవాణి, హేమంత్. విక్టర్ బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కూలీలకు ఉపాధి కరువు

- ఇంత వరకు పనులు గుర్తించని అధికారులు
- పని కల్పించాలని వేడుకుంటున్న ఉపాధి కూలీలు


పని కల్పించాలని కోరుతున్న ఉపాధి కూలీలు (ఫైల్)

కొత్తపట్నం:

ఉపాధి కూలీలకు పని కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. కుటుంబాలనికి వంద రోజుల పని కల్పిస్తామని చెప్పి నేటికీ పనులు కల్పించక పోవడంతో కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంత పేద ప్రజలు ఎక్కువగా ఉపాధి పనులపై ఆధారపడి జీవిస్తారు. సహజంగా సంక్రాంతి పండగ అయిపోయిన తర్వాత ఉపాధి పనులు ప్రారంభిస్తారు. అయితే కొన్ని పంచాయతీల్లో పనులు ఇప్పటికీ ప్రారంభించలేదు. గత ప్రభుత్వంలో మంజూరైన పనులు చేస్తున్నారు. కొత్త పనులు గుర్తించక పనులు కల్పించలేదని అధికారులు చేతులెత్తాశారు. మండలంలో 11,194 కుటుంబాలకు జాబ్‌కార్డులు మంజూరు చేశారు. వారికి నూరు రోజుల పని దినాలు కల్పించాల్సి ఉంది. గ్రామంలో రైతులకు ఉపయోగపడే పనులు గుర్తించాల్సి ఉంది. పనులు గుర్తించి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి మళ్లీ పనులు మంజూరయ్యే సరికి నెలకుపైగా కాలం గడుస్తోందని, తమకు పనులు ఎప్పుడు కల్పిస్తారని కూలీలు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఉపాధి పనుల ఆధారంగా మండలానికి అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయిస్తారు. ఉపాధి కూలీలు ఎంత ఎక్కువ పనిచేస్తే అంత కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తుంది. గ్రామాలు మౌలిక వసతులతో కూడిన అభివృద్ధి కావాలంటే ఉపాధి కూలీలపై ఆధారపడి ఉంది. ఇంత ప్రాధాన్యం ఉన్న పనులు గుర్తించలేదంటే ప్రభుత్వాలు ఏవి ధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గతేడాది కూలీలకు చేతినిండా పనులు ఉండేవి. పనులు గుర్తించి కూలీలకు ఉపాధి కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- ఆర్ఐవో సైమన్ విక్టర్


డీఆర్వోతో మాట్లాడుతున్న ఆర్ఐవో సైమన్ విక్టర్

ఒంగోలు సిటీ: 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియెట్ పబ్లిక్ ప్రాక్టికల్ పరీక్షలు జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్, ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి సైమన్ విక్టర్ అన్నారు. గురువారం స్థానిక ఏకేవీకే కళాశాలలో పరీక్షలకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఐవో సైమన్ విక్టర్ మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 1వ తేదీన నైతిక అండ్ మానవ విలువల పరీక్ష, ఫిబ్రవరి 3వ తేదీన పర్యావరణ విద్య పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలు ఆయా కళాశాలల్లోని మొదటి సంవత్సరం విద్యార్థులకు మాత్రమే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ రెండు పరీక్షలు విద్యార్థులకు తప్పనిసరన్నారు. పరీక్షలకు ఇంటర్మీడియట్ బోర్డు ద్వారా ఆన్‌లైన్ ప్రశ్నపత్రం పరీక్ష సమయానికి అరగంట ముందుగా లభ్యమగునని, జిల్లాలో 186 కళాశాలల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలు రాసి అర్హత పొందితే ఇంటర్మీడియెట్ పాస్‌సర్టిఫికెట్ జారీ అవుతుందని తెలిపారు. ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు మూడు విడతలుగా 35 పరీక్ష కేంద్రాల్లో ఫిబ్రవరి 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన ప్రయోగశాలలు సంతృప్తిగా ఉన్న కళాశాలలనే పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశారన్నారు. ప్రయోగశాలలు సరిగా లేని కళాశాలలు వీటికి దగ్గర ఉన్న పరీక్ష కేంద్రాలు జత చేస్తామని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌గా ప్రభుత్వ కళాశాల అధ్యాపకులను నియమించినట్లు పేర్కొన్నారు. ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో అన్ని ప్రయోగశాలలో నిఘా కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని జిల్లా కార్యాలయానికి, ఇంటర్ బోర్డు కార్యాలయానికి అనుసంధానం చేసినట్లు పేర్కొన్నారు. ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు 3902 మంది ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు నిర్వహించనున్నట్లు చెప్పారు. జనరల్ ఇంటర్ విద్యార్థులకు సైన్స్ ప్రాక్టికల్ ఫిబ్రవరి 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రెండు విడతల్లో రోజూ ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు 92 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. జనరల్ సైన్స్ ప్రాక్టికల్స్‌కు ద్వితీయ సంవత్సరం చదువుతున్న 14,538 మంది సైన్స్ విద్యార్థులు హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సైన్స్ ప్రాక్టికల్లో భాగంగా మైనర్ సెబ్జెక్టుగా ఉన్న జియోగ్రఫీ ప్రాక్టికల్ పరీక్ష కేంద్రంగా గిద్దలూరు ఎస్వీ జూనియర్ కళాశాలను ఎంపిక చేశామన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులకు తగు సూచనలు చేశామని చెప్పారు. ప్రాక్టికల్ పరీక్షలను జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు కె.ఆంజనేయులు, ఎ.చంద్రశేఖర్, పి.కోటేశ్వరరావు, రామసుబ్బారెడ్డి, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు నిరంతరం పర్యవేక్షిస్తాయని తెలిపారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి కార్యాలయంలో సమన్వయ సమావేశంలో జిల్లా పోలీసు, రెవెన్యూ, పాఠశాల విద్య, పోస్టల్ శాఖ, వైద్యశాఖ, విద్యుత్, ఆర్టీసీ యంత్రాంగం, మున్సిపల్, జిల్లా పంచాయతీ విభాగ అధిపతులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై, తదితరులు

సంతనూతలపాడు: రహదారి భద్రత మాసంలో భాగంగా సంతనూతలపాడులో గురువారం ఒంగోలు రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ఎన్ఎస్ఎస్ యూనిట్, పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రమాదాల నుంచి కాపాడుకోవాలని సూచించారు. ఒంగోలు ఆర్జీయూకేటీ ఏవో రూపస్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఏ పావని లావణ్య, సంతనూతలపాడు ఎస్సై అజయ్ బాబు పాల్గొని రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు. సంతనూతలపాడు బస్టాండ్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ సాగింది.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల వివరాలు పంపాలి

ఒంగోలు సిటీ: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 135 ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే 613 మంది ఉపాధ్యాయుల వివరాలను ఒంగోలు విద్యాశాఖ కార్యాలయానికి పంపించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, ప్రభాకరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉపాధ్యాయుల శాంక్షన్, వర్కింగ్ పోస్టులను ప్రాథమిక పాఠశాలల్లో 2024 డిసెంబర్ 31 విద్యార్థుల రోల్ ప్రకారం కేటాయించాలని, 1:40 ప్రకారం సర్‌ప్లస్ టీచర్ల వివరాలు ఈ నెల 31వ తేదీ సాయంత్రం లోగా డీఈఓ కార్యాలయానికి పంపించాలని సూచించారు.

అంతర పంటలు సాగుచేయాలి


పొగాకు రైతులకు మెళకువలు తెలియజేస్తున్న వేలం నిర్వహణ అధికారి రామకృష్ణ

చీమకుర్తి రూరల్: మండలంలోని ఇలపావులూరు గ్రామంలో ఐటీసీ సహకారంతో గ్రామసిరి ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు కోఆర్డినేటర్ బసవయ్య పాల్గొని మాట్లాడుతూ వరి, మిరప, కంది, మినుము పంటలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ప్రధాన పంటలతో పాటు అంతర పంటలపై అవగాహన కల్పించారు.

పొగాకు రైతులకు శిక్షణ...

చీమకుర్తి మండలంలోని చంద్రపాడు గ్రామంలో పొగాకు రైతులకు యాజమాన్య పద్ధతులు, సుస్థిరమైన పొగాకు ఉత్పత్తిలో పాటించాల్సిన మెళకువలపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వెల్లంపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. అధికారులు, రైతులు పాల్గొన్నారు.

చీమకుర్తి లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం


కళాప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న గోపీచంద్

చీమకుర్తి: చీమకుర్తి లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయమని లయన్స్‌క్లబ్ గవర్నర్ పీ గోపీచంద్ అన్నారు. గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం చీమకుర్తిలోని లయన్స్ క్లబ్ ద్వారా చేపట్టిన సేవా కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొలుత ఎన్ఎస్‌పీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నూనె హేమసుందర్ తల్లిదండ్రులు నూనె యలమంద, శేషారత్నం కళాప్రాంగణాన్ని ప్రారంభించారు. తదుపరి లయన్స్‌క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ చలువాది బదరీనారాయణ ఆర్థిక సహకారంతో జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్మించిన వాషరూములను ప్రారంభించారు. మండల పరిషత్ ఉర్దూ పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న ఐరన్ షల్టర్, బాత్‌రూమ్‌లను పరిశీలించారు. ప్రభుత్వాస్పత్రిలో గతంలో నిర్మించిన షెడ్డును పరిశీలించారు. పలు ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన సామగ్రిని డాక్టర్ బీ జవహర్ ఆస్పత్రి ప్రాంగణంలో జరిగిన సమావేశంలో అందించారు. తొలుత గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాలలో ఎంతఊలు నరసింహారావు, శివాజీ, నూనె సుబ్రహ్మణ్యం, అనుదీప్, జే యాకోబు, జీ వీరాస్వామి, చలువాది రమేష్, వేమూరి సుబ్బరామయ్య, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా పరమేశ్వరిదేవి ఆత్మార్పణ దినోత్సవం


పూజకు హాజరైన మహిళలు


వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు

ఒంగోలు మెట్రో: వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఒంగోలు అమలనాధుని వారి వీధిలో కొలువైన వాసవి కన్యకా పరమేశ్వరి దేవి దేవస్థానంలో గురు, శుక్రవారాలు రెండు రోజులపాటు భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విజయవాడ వాస్తవ్యులు అంబడిపూడి మారుతి ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో చక్ర నవావరణార్చన పూజ, కుమారి పూజ చేశారు. సాయంత్రం జరిగిన కార్యక్రమాల్లో భాగంగా పెద్ద సంఖ్యలో విచ్చేసిన మహిళలు చండీ పారాయణ వాసవి అష్టకం పఠించారు. అనంతరం వాసవి కోలాట భజన మండలి కోలాటంతో గుడి ఉత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు నవ హారతులతో అమ్మవారికి నీరాజనాలు సమర్పించారు. వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ తదియారాధన సంఘ సభ్యులు కార్యక్రమం నిర్వహించారు.

మంత్రి నారాయణను బర్తరఫ్ చేయాలి

- ఫీజు కోసం ఒత్తిడి చేసి విద్యార్థిని పొట్టనపెట్టుకోవడం దారుణం
- ఒంగోలులో నారాయణ క్యాంపస్ ఎదుట విద్యార్థి సంఘాల ఆందోళన


ఒంగోలు నారాయణ క్యాంపస్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాలు

ఒంగోలు సిటీ: అనంతపురంలోని నారాయణ కాలేజీలో ఫీజుల ఒత్తిడిని భరించలేక భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన బాధాకరమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ వినోద్ పేర్కొన్నారు. మంత్రి నారాయణను బర్తరఫ్ చేయడంతో పాటు నారాయణ విద్యా సంస్థల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం ఒంగోలులోని నారాయణ విద్యా సంస్థ ఎదుట ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ.. పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో ఫీజుల పేరుతో విద్యార్థులను మానసికంగా వేధించడం సరికాదన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని కట్టడి చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. విద్యార్థుల మృతిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ మాట్లాడుతూ.. ఇంటర్ బోర్డు కార్పొరేట్ కళాశాలలకు అమ్ముడుపోయిందని ఆరోపించారు. ఘటన జరిగిన కాలేజీని సీజ్ చేసి, కారకులకు అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.వీరాస్వామి, ఒంగోలు నగర అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్, ఆనంద్, విజయ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి జె.వెంకటేష్, విక్రమ్ పాల్గొన్నారు.

వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ్‌రెడ్డి

ఒంగోలు సబర్బన్: ఒంగోలు వాణిజ్య పన్నుల కార్యాలయం–1 సర్కిల్‌లో ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల ఉద్యోగుల సంఘం–2025 డైరీని నెల్లూరు జాయింట్ కమిషనర్ ఏ.రవీంద్రనాథ్‌రెడ్డి ఆవిష్కరించారు. స్థానిక కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమానికి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పైనం మల్లికార్జునరావు, అసిస్టెంట్ కమిషనర్ ఒంగోలు–1 సర్కిల్ కె.వర్షిణి, అసిస్టెంట్ కమిషనర్ ఒంగోలు సర్కిల్–2 టి.సోమసుందర్ ప్రసాద్, డీసీటీఓలు ఎన్వీ సుబ్బారావు, గుడి శ్రీనివాసరావు, కోటా సుధాకర్, కమర్షియల్ ట్యాక్స్ ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పోలు సుధాకర్, డివిజన్ అధ్యక్షుడు సాధు నరసింహారావు, ఏసీటీఓలు ఏలూరి కొండలరావు, అహ్మద్‌బాష, సిబ్బంది పెద్దమ్మాయి, కిషోర్, తిమోతి, హరిప్రసాద్, అంజమ్మ, తిరుపతిరావు, వెంకటరెడ్డి, పెండ్యాల శ్రీను, ఖాదర్ బాషా పాల్గొన్నారు.


గాంధీకి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి, చుండూరు, వైఎస్సార్ సీపీ నాయకులు

జాతిపిత గాంధీకి ఘన నివాళి

- వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గాంధీ వర్ధంతి సభ
- ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి


గో సంఘం వద్ద గాంధీకి నివాళులర్పిస్తున్న వాసవి క్లబ్ సభ్యులు


సంతనూతలపాడులో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు


ఉప్పుగుండూరులో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

ఒంగోలు సబర్బన్: దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన జాతిపిత మహాత్మా గాంధీకి వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. తొలుత బూచేపల్లి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతిపిత ఆశయాలను పార్టీలో అమలు చేస్తున్నామన్నారు. అహింసను ఆయుధంగా చేసుకొని దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన గొప్ప వక్తని కొనియాడారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త చుండూరి రవిబాబు మాట్లాడుతూ పార్టీలో మహాత్మా గాంధీ సిద్ధాంతాలను అమలు చేస్తున్నామన్నారు. అహింసతోనే ఏదైనా సాధించవచ్చన్నారు. మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు నగర పార్టీ అధ్యక్షుడు కఠారి శంకర్, చీమకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు తోపాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఒంగోలు మెట్రో: గాంధీ వర్ధంతి సందర్భంగా వాసవి క్లబ్ ఒంగోలు సిటిజన్స్, వాసవి క్లబ్ ఒంగోలు సభ్యులు స్థానిక బాపూజీ గో సంఘం వద్ద బాపూజీ ప్రతిమకు పూలమాలలు సమర్పించి జోహార్లు పలికారు. ఈ సందర్భంగా సిటిజెన్ క్లబ్ అధ్యక్షుడు భూమా శ్రీనివాసులు, ఒంగోలు క్లబ్ అధ్యక్షుడు కె.భరత్ సింహ మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ ప్రతి ఒక్కరికి స్ఫూర్తి అన్నారు. అహింస అనే ఆయుధంతో భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా కృషి చేశారని చెప్పారు. వాసవి క్లబ్ అంతర్జాతీయ అధికారి జి.బ్రహ్మానందం, నల్లమల్లి నారాయణ, జోన్ చైర్మన్ పబ్బిశెట్టి గోవర్ధన్, క్లబ్ కార్యదర్శులు మద్దాలి శివప్రసాద్, అన్నం వెంకట యశో రాజానంద్, కోశాధికారులు బియ్యపు సంపత్‌కుమార్, తవ్వా కిరణ్, తుమ్మపూడి ఏడుకొండలు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో...

సంతనూతలపాడు: మండల కేంద్రంలో గురువారం వాసవీ క్లబ్, వాసవీ మహిళా క్లబ్, ఆర్యవైశ్య కళ్యాణ మండపం కమిటీ ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపం, స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ ప్రాంగణాల వద్ద గల గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు వాసవీ మహిళా క్లబ్ అధ్యక్షురాలు చలువాది చంద్రావతి, ఆర్యవైశ్య కళ్యాణ మండపం అధ్యక్షుడు వేమా మల్లేశ్వరరావు తదితరులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్వచ్ఛభారత్ నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ జిల్లా ప్రతినిధి గ్రంధి లక్ష్మీప్రసాదరావు, ఆర్యవైశ్య కళ్యాణ మండపం ఉపాధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ, కోశాధికారి వేమా చిన్న వెంకట కృష్ణారావు, వాసవీ మహిళా క్లబ్ సెక్రటరీ శిఖాకొల్లి జయశ్రీ, కోశాధికారి జి.శ్రీలక్ష్మి, మహిళా క్లబ్ మాజీ అధ్యక్షురాలు ఎస్.విజయలక్ష్మి, వాసవీ మహిళా క్లబ్ ప్రతినిధులు ఎస్.సుకన్య, ఎస్.పద్మశ్రీ, వాసవీ క్లబ్ గౌరవాధ్యక్షుడు పొదర్తి గిరి, ఉపాధ్యక్షుడు వేమా శ్రీనివాసరావు, సెక్రటరీ వేమూరి ఆంజనేయులు, కోశాధికారి పామిడి సుధాకర్ తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

ఉప్పుగుండూరులో...

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో గ్రంథాలయం సెంటర్‌లోని గాంధీజీ విగ్రహానికి గురువారం క్షీరాభిషేకం చేసి పూలమాలలతో నివాళులర్పించారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు కొంజేటి సురేష్‌బాబు, అమరా వేణు, లక్ష్మీనారాయణ, తెలగతోటి సుబ్బయ్య, బాబు, కొంజేటి శ్రీను, జలంధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశువుల వ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దు


పశుపోషకులకు మందులు పంపిణీ చేస్తున్న అనూష

చీమకుర్తి రూరల్: పశువులు, జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధులను నిర్లక్ష్యం చేయవద్దని పశువైద్యుడు టి.మనురూప్ సూచించారు. మండలంలోని కూనంనేనివారిపాలెం సచివాలయం పరిధిలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. 15 దూడలు, 100 గేదెలకు నట్టల నివారణ మందు తాపించారు. నాలుగు పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు, ఎదకు రాని 30 పశువులకు వైద్యం అందించినట్లు పశువైద్యుడు తెలిపారు. సర్పంచ్ బక్క శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

మంచు నుంచి పశువులను కాపాడుకోవాలి

ఈతముక్కల (కొత్తపట్నం): నెల రోజుల నుంచి పొగ మంచు విపరీతంగా పడుతోందని, దాన్ని నుంచి పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలని పశుసంవర్థక శాఖాధికారి టి.అనూషా సూచించారు. పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 58 గేదెలకు నత్తల నివారణ మందులు, 44 దూడలకు, 200 గొర్రెలకు నట్టల నివారణ మందులు తాపించారు. 20 గేదెలకు చూడి పరీక్షలు, 16 గేదెలకు గర్భకోశ పరీక్షలు, 8 గేదలకు కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్ చేశారు. వి.నందకుమార్‌రెడ్డి, అల్లూరు పశువైద్యాధికారి వి.శోభ, ఆర్.బాలకృష్ణ, మాజీ ఎంపీటీసీ ఎం.నరసింహారావు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ


గిరి ప్రదక్షిణకు హాజరైన భక్తులు

ఒంగోలు మెట్రో: వెంకటేశ్వరస్వామి జన్మనక్షత్రం సందర్భంగా ఒంగోలు కొండపై కొలువైన వెంకటేశ్వర స్వామి దర్శనానికి భక్తులు గురువారం పోటెత్తారని గిరి ప్రదక్షిణ కమిటీ అధ్యక్షుడు రాధా రమణగుప్తా తెలిపారు. కార్యక్రమంలో భాగంగా స్వామి ఉత్సవ మూర్తిని సుందరంగా అలంకరించిన పల్లకిపై ప్రతిష్ఠింపజేసి నగర వీధుల్లో ఊరేగించారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ భక్తులు గిరి ప్రదక్షిణ పూర్తి చేశారు. గిరి ప్రదక్షిణలో శ్రీవారికి ఉపయోగకరమైన 30 వేల విలువైన ఇత్తడి ఛత్రాన్ని శనగపల్లి శేషారావు సతీమణి అనసూర్యమ్మ జ్ఞాపకార్థం గిరి కమిటీ అధ్యక్షులకు అందజేశారు. ఫ్యామిలీ క్లబ్ అధ్యక్షుడు పొట్టి వీరరాఘవరావు ప్రసాద కైంకర్యాన్ని సమర్పించారు.